తదేక గీతం



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

తదేకగీతం

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

క్రిసెంట్ పబ్లికేషన్స్
విజయవాడ * హైదరాబాద్

THADHEKA GEETHAM

Somepalli Venkata Subbaiah

First Edition: November, 2006

Cover Design: GIRIDHAR

Copies available at:

CRESCENT PUBLICATIONS
29-25-43A, Vemuri Vari Street
Suryarao Pet, VIJAYAWADA - 520 002
Phone: 0866 - 6662666 / 6663666

Composed and Printed at:

CRESCENT PUBLICATIONS
VIJAYAWADA - 520 002

© All rights reserved

Rs. 30/-

అంకితం

నాకు
ఆచార్య ఎన్. గోపి గారంటే
ఎంతో ఇష్టం.
అందుకే ఈ తదేకగీతం

పల్లెకు పట్టం కట్టిన కవిత్వం

- డా॥ ఎన్. గోపి
కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

సోమేపల్లి వెంకట సుబ్బయ్యగారు అచిరకాలంలోనే తెలుగు కవిత్వ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇంతకుముందు నాలుగు కవిత్వగ్రంథాలను ప్రచురించారు. ఇది ఐదో పుస్తకం. మొదటిది 'లోయలో మనిషి' వచన కవితా సంపుటి. రెండోది 'తొలకరి చినుకులు' నానీలు, మూడోది మళ్లీ వచన కవితా సంపుటి - పేరు 'చల్లకవ్వం'. నాల్గోది 'రెప్పల చప్పుడు' మళ్లీ నానీలు.

నానీలు సోమేపల్లి వారికి ఆరో ప్రాణంగా మారిపోయాయి. నానీ రాయడం సులభం కాదు. రాయడానికి పూనుకుంటే తెలుస్తుంది. సోమేపల్లి అటు వచనకవితా ఇటు చిన్నకవితా సమర్ధంగా రాయగలనని నిరూపించు కున్నారు. దేనికైనా సంవేదనా, కవితా శక్తి, నిజాయితీ ముఖ్యం. అవి వెంకట సుబ్బయ్యగారిలో పుష్కలంగా వున్నాయి.

సోమేపల్లి - ఎస్.ఆర్. భల్లం ద్వారా తణుకులో పరిచయమయ్యారు. అప్పుడు ఎం.ఆర్.ఓ.గా ఉన్నారు. ఆ పరిచయం పరిచయంగా ఆగక పరిమళవంతమైన స్నేహంగా, అమలమైన ఆత్మీయతగా మారాయి.

ఈ కవి తన పుస్తకాలకు పెట్టిన పేర్లను బట్టే ఆయన స్వభావం ద్యోతకమౌతుంది. వస్తుతః సోమేపల్లి మట్టిబిడ్డ, పల్లెజీవి, కల్లాకపటం లేని కర్షక కాంతి. మార్పు సహజం కావొచ్చుగానీ ఆ వెల్లువలో మంచి విలువలు కూడా కొట్టుకుపోతూంటే మాత్రం ఆయన విలవిల్లాడిపోతారు. ప్రపంచీ కరణలాంటి మాటలు వాడరు. కానీ పల్లెచిత్రం ఆనవాలు కోల్పోతున్నప్పుడు కవిత్వం రాయకుండా వుండలేని అనివార్యతా గుణం సంక్రమిస్తుంది.

మనసుల మధ్య మమతల వంతెన నిర్మించి
ప్రేమతో పలకరించే వాళ్లం

* * *

ఏ గాడ్పులకు బలైందోగానీ
ఇది మా ఊరేనా అని సందేహం.

మనమిప్పుడు మన ఊరికి వెళ్తే అక్కడ మన ఊరుండదు. ఉండదా అంటే వుంటుంది గానీ మన చిన్నప్పటి ఊరు కాదు. ఇటువంటి సంవేదనను ఆంగ్లకవి గోల్డ్‌స్మిత్ హృదయదఘ్నంగా వర్ణించాడు.

దేశం చెట్టుకు (నిత్యహరితశోభితం) టెర్రరిస్టు క్రిములు సోకాయని వాపోతాడు కవి. 'కడుపే ఖైదు' అవుతుందా అని కడుపులోనే ఆడశిశువును చంపే వైనాన్ని నిరసిస్తాడు.

టైటిల్ కవిత 'తదేకగతం' మానవత్వానికెత్తిన పతాక.

"మానవీయతనానికి
మమతలచెమ్మ
అప్పుడే శాంతిసుమాల పరిమళం"
మరిజరుగుతున్నదేమిటి?
"చెట్టపట్టాల రైలు పెట్టెలూ
రెక్కల విమానాలై
ఖండాంతరాలకు ఎగిరిపోతే!"
బడుగు కూడళ్లు భస్మీపటలమవుతాయంటారు.

ఇలా ఈ సంపుటిలోని కవితలన్నీ ఆర్ద్రసమన్వితంగా ఉన్నాయి. సోమేపల్లి వారి కవిత్వంలో పంచదార వుండదు. మట్టిజీర వుంటుంది. భావధార వుంటుంది.

అతను వ్యక్తిగా స్నిగ్ధ హృదయుడు. స్మిత పూర్వాభిభాషి. మాటలాగే మనసూ మృదువు. పెద్దమనిషి. సోమేపల్లి వ్యక్తిత్వంలాగే అతని కవిత్వం కూడా.

ప్రోత్సాహపు పల్లవులు

డాక్టర్ సినారె, డా॥ నాగభైరవ, డా॥ అద్దేపల్లి, డా॥ ద్వానా శాస్త్రి, శ్రీ రసరాజు, శ్రీ ఎస్.ఆర్. భల్లం, శ్రీ పెనుగొండ లక్ష్మి నారాయణ, శ్రీ పాపినేని శివశంకర్, శ్రీ చలపాక ప్రకాష్, శ్రీ బీరం సుందరరావు, అంకితం అందుకున్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపి, శ్రీమతి ఎన్. అరుణలకు కృతజ్ఞతాచరణాలు.

తల్లితండ్రులు శ్రీ సోమేపల్లి హనుమంతరావు, నాగరత్నం; ఆత్మీయులు శ్రీ తోటకూర వెంకటనారాయణలకు హృదయ పూర్వకనమస్సులు.

అర్ధాంగి విజయలక్ష్మికి, అబ్బాయిలు శ్రీవశిష్ఠ, శ్రీవిశ్వనాథ విరించిలకు ఆత్మీయతా ఆశీస్సులు.

పుస్తకాన్ని ముచ్చటగా ముద్రించి ఇచ్చిన 'క్రిసెంట్ పబ్లికేషన్స్' వారికి, నా కవితలు ప్రచురించిన వివిధ పత్రికాధిపతులకు, సంకలనకర్తలకూ కృతజ్ఞతలు.

- సోమేపల్లి వెంకటసుబ్బయ్య

ఇది మా ఊరేనా...?

వేషధారణలేకాదు...
సంభాషణలూ సంబోధనలూ
కొత్తకొత్తగా మారిపోయాయి...!
అప్పట్లో
ఊరి కరణాన్నో మునసబునో
పాఠాలు చెప్పే పంతులుగారినో
"అండీ..." "గారూ..." అని పిలిచేవాళ్ళం
కులమూ మతమూ ఏదైనా
కూలోళ్ళయినా
పిలుపు – గుండె గొంతులోంచి వెల్లువై
ఆప్యాయతై అల్లుకుపోయేది
వయసుని బట్టీ వరసనుబట్టీ
అన్న అనో తమ్ముడనో అత్త అనో మామ అనో
పిన్నీ బాబాయనో
పలకరింపుల పల్లవులతో
మనసుల మధ్య మమతల వంతెన నిర్మించి
ప్రేమతో పలకరించే వాళ్ళం
ఒకరి పొలంలో ఒకరు
చేయీచేయీ కలిపి పనిచేస్తుంటే
సహకారసూత్రం పుట్టింది

ఈ పొలాల నుంచేనేమోననిపించేది
మంచీ చెడూ కష్టమూ సుఖమూ
ఒకరికొకరు పంచుకునే వేదికైన వీధి అరుగు
మమకారపు పందిరిగా మారిపోయేది
ఇప్పుడు చూస్తే...
బడి పిల్లల మాటలు
గణతంత్రానికి బదులు 'వాలంటైన్స్‌డే' గురించే!
పాలు దొరుకుతాయో లేదోగాని
ఊరినిండా పెప్సీలూ కోలాలూ కొల్లలు
గ్రామం మెదడును
బుల్లితెర దురాక్రమణ చేసి
బూజుపట్టించిన దృశ్యం కొండంతలై కన్పిస్తోంది
కుర్రకారు మాటలు సైబర్ కోటలు దాటి
సెల్‌ఫోన్‌లూ ఇంటర్నెట్‌కేఫ్‌లూ పిజ్జాల పబ్‌ల వైపు
కళ్ళెం తెంచుకున్న గుర్రాలై విహరిస్తున్నాయి
"హాయ్...", "హలో..." పిలుపులు వింటుంటే
ప్రపంచం ఓ కుగ్రామం అయిందో లేదోగాని
ఆత్మీయతలు మాత్రం అమడ దూరం జరిగాయనిపిస్తోంది
ఏ గాడ్పులకు "బలై"ందో గానీ
ఇది మా ఊరేనా అనే సందేహం
నా మెదడును తొలుస్తూనే వుంది

(ప్రజాశక్తి, 15-మే, 2005)

నిత్యహరిత శోభితం

చెట్టు చిగురై పరిమళించేదీ
పువ్వు ఫలమై కడుపు నింపేదీ
జనం గుండెల నిండా
చల్లదనపు జల్లులు వెల్లువయ్యేదీ
అన్నివేర్లూ
సుష్ఠుగా పుష్టిగా వున్నప్పుడేగా!
ఒక్క వసంతకాలమే కాదు
ఈ వృక్షం
నిత్యం చిగురిస్తూ
పచ్చదనం పంచుతూ వుండాల్సిందే
అందుకేనేమో
ఈ చెట్టుకు అన్ని వేర్లూ కొమ్మలూ.
ఎన్ని వానలు కురిస్తే ఏం లాభం...?
ఎన్ని నీళ్ళు పోస్తే ఏం ప్రయోజనం...!?
చెట్టు వడబడి పోతూనే వుంది
తల్లి వేరుకు
కుల మత భాషా ప్రాంతీయ ఉన్మాదాల
చీడ సోకిందేమో!
పక్కవేర్లను
హింస, మూఢాచారాలు, అవినీతి
విషప్పురుగులై చుట్టుముట్టాయేమో
ఏ సంహారక మందులు చిమ్మితే
టెర్రరిస్టు క్రిములు

తుడిచిపెట్టుకుపోతాయో
ఏ ఎరువులు వేస్తే
మళ్లీ నిత్యహరిత శోభితమవుతుందో
శాంతి పుష్పాలు వికసించాలంటే
పురిటిగడ్డను పసిబిడ్డలా సాకాల్సిందే
గుండెగుండెతో జతకట్టినప్పుడే
జనస్వామ్యపు తరువు
నిరంతర హరితవర్ణమై
పరిఢవిల్లుతుంది
సంఘీభావ జపం
తూతూ మంత్రమయినన్నాళ్ళూ
ప్రజల కోసం ప్రజలే నాటుకున్న
ఈ చెట్టు కొమ్మలు
పెళుసుగా మారి
ఫెళ్ళున విరిగిపోతాయి.

(విశాలాంధ్ర, 20-ఫిబ్రవరి, 2005)

వేడికోలు

ఇంకా ఆకృతి దాల్చని
బిడ్డను మాట్లాడుతున్నాను
పేగుబంధం
పెనవేసుకోకముందే
మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి
ప్లస్సు, మైనస్సు అంకెల గుణాంకాలను
వదుల్చుకొని
ఒక్కసారి బయటకు రండి
డేగకళ్ళ శూలపు చూపులకి
ఆదాయపు ఆనవాలు కనబడకపోతే
కడుపే ఖైదు అవుతుందా...?
ఆడ జాడ తెలిస్తే
ఆత్మీయపు ఆవరణ
ఖనన వేదికగా మారిపోతుందా...?
కడుపునిండా తిండీ
నిలువెల్లా ఆత్మగౌరవం
నడకా నడతా ఆరోగ్యం
ఇవ్వగలిగితే
అప్పుడు ఆలోచించండి
జన్మనిచ్చే విషయం
జవాబు లేకుంటే
నన్ను ప్రశ్నగానే మిగల్చండి
ఇది
రూపుదాల్చని మీ బిడ్డ
వేడికోలు...!?

(ఆంధ్రప్రభ, 29-ఆగస్ట్, 2005)

సిగ్గుచేటు

జాతిపిత గుండెల్లో
క్షిపణివేగంతో
పుకార్లు
మానవత
రక్తమందారమై చిట్లింది
మతోన్మత్తుల క్రీడాస్థలిలో
మనిషొక బంతిగా పగిలాడు
కడుపులోని పసిగుడ్డూ
నడువలేని ముదివగ్గూ
రోడ్డుమీది నెత్తుటి ముద్దలు
ఉన్మాదాగ్నికి
ఊపిరులు విలవిల
ఇది
మానవత్వం గుండెపై
మానని గాయం
ఛీ! ఛీ!!
గోద్రా మరకలు ఎప్పటికీ మాసిపోవు

(గుజరాత్ గాయం - కవితాసంకలనం)

మనిషి కోసం

పరిస్థితిని
ఎప్పటికప్పుడు వెల్లడించే
ఆన్‌లైన్
సమాచారం
నిత్యదర్శనానికి
టీవీ ఛానల్స్...
ఇక
మనసు విప్పి
మాట్లాడే మనిషిని
కనుగొనే శాస్త్రవేత్త కోసమే
నిరంతర అన్వేషణ...!?!

(పత్రిక, మార్చి, 2005)

సినిమా సిలబస్

కళాశాలలకిక
కొత్త ప్రాస్పెక్టస్
సరికొత్త సిలబస్
ఇప్పుడు
పంతులోరు
ప్రేమపక్షుల్ని కలిపే పేరయ్య
క్లాసులో
గురువిప్పుడు గురువుకాదు
జోకర్
ఆవరణనిండా
వెకిలి ప్రేమ పారాయణం
వలువలుంటే గద
విలువలుండడానికి
ఇదో నయా ఇన్నొవేషన్
సిల్వర్ స్క్రీన్ సిలబస్
ఇక్కడ
ఎంట్రెన్స్ - రాగింగ్‌తో...
ఫైనల్ ఎగ్జామ్స్ - ప్రేమ పాఠాలతో...

(విశాలాంధ్ర, 26-జనవరి, 2003)

క్లీనర్

"అరేయ్! ఒరేయ్!" అని పిలుస్తావా...
కొన్నాళ్ళకి
అదే వాడి పేరవుతుంది
తొడిమె వీడని బాల్యమది
సహజ కవచకుండలాల్లా
మురికి గుడ్డా
ప్లాస్టిక్ బక్కెట్
ఆకలి కడుపుకి
నాలుగు మెతుకుల కోసం
ఎంగిలి తుడిచే గుడ్డగా మారుతాడు
మడిచిన విస్తర్లా
మురికినీరుతో
తానే ఓ ఆరనిబక్కెట్టైపోతాడు
కాకాహోటలైనా
స్టార్ హోటలైనా
అవతారం మాత్రం అదే!
టేబుల్ అద్దంలా మెరుస్తుంది
వాడి ఒంటినిండా మురికి కురుస్తుంది

(నేటినిజం, 12-డిసెంబర్, 2003)

ఏకాకులు

వచ్చే పోయే బంధుజనంతో
అనుబంధాలు
మందారాలయ్యేవి
అడ్డెడు బియ్యం
పొయ్యి దిగే లోగిళ్ళు
కేరింతల కేదారాలయ్యేవి
గంపెడు సంసారమైనా
శ్రమ విభజన సూత్రం
ఇరుసుకి ఇంధనమై
కుటుంబ చక్రం గిర్రున తిరిగేది
కావడి పెట్టెలో
పెరుగుముంతలాగో
ఉట్టిమీద పాల చట్టిలాగో
వృద్ధులూ పిల్లలూ
ఎప్పుడూ రక్షణ వలయానికి
లోపలే ఉండేవాళ్ళు
మరిప్పుడో...
చింతలులేని చిన్నకుటుంబాలొచ్చాయి
అనుబంధాలూ
ఆత్మీయతలకిక్కడ
కర్ఫ్యూ!
ముసలీముతకల
కేరాఫ్ అడ్రస్

వృద్ధాశ్రమాలు
మరి పిల్లలో...!?
చిల్డ్రన్ హోమ్‌లు...
ఆహా! ఎంత బాగుందో!!

(తెలుగు విద్యార్థి, డిసెంబర్, 2003)

దుర్మార్గం

బంగారు గుడ్లకోసం
బాతునే చంపుతావా?
నమ్మకం
వధ్యశిలపై బలిపశువయ్యింది
పుల్లాపుడకా పోగుచేసి
కొమ్మనే నరికేసి
తుంపులు చేసేవాళ్ళూ
చేపకి ఎరలా
అరచేతిలో "కృషి" చూపించి
'చార్మినార్'నే ఎత్తుకుపోయేవాళ్ళూ
ఏమి వ్యవస్థ యిది?
పెళ్ళిళ్లూ చదువులూ
చరమాంకపు బతుకులగతుకుల
విషాదావసరాలూ
ఏమి అవస్థ యిది!?
ఆశా
అమాయకత్వాలు
చిట్‌ఫండ్లుగా డిపాజిట్లుగా
జమయిపోయాయి
గొర్రె
కసాయిని నమ్ముతూనే వుంటుంది
అందుకే
ఈ కలల ఇసకగూళ్ళు

(వార్త, 08-జులై, 2002)

అగ్నిక్షిపణి అరాఫత్

పోరాటానికి
పర్యాయపదమేకాదు
స్వేచ్ఛాగానానికి
స్ఫూర్తి గీతానివి కూడా...
పాలస్తీనా గుండె కోవెలలో
శాశ్వతంగా నెలవైన
ఆరాధ్యదైవమా...
అగ్రరాజ్యాల
అరాచక పదఘట్టనల మధ్య నలిగిపోకుండా
ఉవ్వెత్తున ఎగిసిన
అలీన ఉద్యమంలో
జనం బలంతో జతకట్టిన
ఫతా నేతా!
నీ చిరునామా
ఇక ప్రపంచ ప్రజల హృదయాలలో...
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల
నిరంతర స్వాప్నికుడివి
ఇజ్రాయెల్ దారుణ మారణకాండపై
అలసటలేని
ప్రతిఘటనకి నీకిచ్చిన
నోబెల్ బహుమతి చిన్నదేనేమో...
ఇజ్రాయెల్‌ని పావునుచేసి
అమెరికా ఆడుతున్న దోబూచులాటను

ఎదురొడ్డిన
మొక్కవోని యోధుడివి
పాకిస్తాన్ పుకార్లను తిప్పికొట్టి
భారత్‌కి బలమిచ్చిన వీరుడివి
స్వేచ్ఛా పిపాసులకు
యుద్ధంలోనూ శాంతిలోనూ
నువ్వు పెద్దదిక్కువే...
ఓ ఆరాఫత్!
నీ మరణం
ఇజ్రాయిల్ బురుజుపై
ఎప్పుడూ ఎగిరే అరుణ పతాకమే
ప్రజలకు
పోరాటం అవసరం వున్నన్నాళ్ళూ
జనం గుండెల్లో
పేలే క్షిపణివే

దా'రుణం'

అమ్మ రుణం
తీర్చుకోమంటే
ఆధునిక మూల్యాంకనదర్శిని కోసం
వెతుకుతాడు
అర్ధాంగి శ్రమను
గుర్తించమంటే
ఆల్జీబ్రాతో
కుస్తీపడతాడు
అనుబంధం ఆత్మీయతలు
అమూల్యమైనవని
చెవిలో ఇల్లు కట్టుకుని
పోరుపెడితే
కంప్యూటర్ క్లిక్‌మనిపించి
మూలాల్లోకి వెళ్ళి
మూల్యాల కోసం వెతుకుతుంటాడు

(విశాలాంధ్ర, 11-మార్చి, 2005)

మోయలేనీ కరువు

అన్నం ముద్దదీ
నీటిచుక్కదీ
విడదీయరాని బంధం
చినుకు చిందులేస్తేనే
చేనుకు ప్రాణకళ వచ్చేది
గుక్కెడు నీళ్ళకోసం
ఎక్కడికని వెళ్ళాలి?
మేఘం మొండికెత్తితే
కళ్ళల్లో కాయలు కాస్తాయి
మబ్బుల్లో కురవని నీరు
కన్నీరుగా మారుతుందా?
నేల తల్లి శరీరం
నెర్రెలు నెర్రెలు
గడ్డీగాదం కరవై
పశువులు కబేళాకి
బతుక్కీ మరణానికీ మధ్య
ఊగుతోన్న లోలకంలా
జీవితం!

(నేటినిజం స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యేకసంచిక, 2002)

మానవీయ సౌధం ముందు...

మనసుచూరులోంచి
ఆత్మవంచన నక్కినక్కి చూస్తుంటే
చూపు
శిఖరం అంచున
ఆలోచన
లోయల లోగిళ్ళలో
ఆకాశానికి నిచ్చెన లేసి
ఆత్రంగా ఎగబాకాలనుకుంటే
మానవీయ సౌధం ముందు
మరుగుజ్జులే...!?

(పత్రిక, అక్టోబరు, 2005)

సొట్టలు పడ్డ బతుకు

బ్రతుకు జల్లనిండా
క్షతగాత్రపు పాత్రలు
ఎక్కేగడపా దిగేగడపా
కొర్రుపట్టిన చొక్కా
అతుకుల పంచా
భుజాన కర్రా
చిల్లుల బొక్కెన్లూ
సొట్టల బిందెలూ, తపేళాలు
పలకదిద్దాల్సిన
చిట్టి చేతులవి!
లోతుకెళ్ళిన కళ్ళతో
కొలిమి ఊదుతుంటే
ఆ జ్వాలలకు
ఆకలిమంటలు చల్లారతాయా?
రిమోట్లొచ్చేసాయి
రేకులు అదృశ్యమౌతున్నాయి
తూట్లయిన బతుకుగిన్నెలకు
మాట్లువేసేదెవరో!?
పగుళ్ళు పూడి
అన్నం
పొయ్యి దిగేదెప్పుడో

(కవితామాలిక, 2005)

దృశ్యం వెనుక

ఆ దృశ్యమే అంత!
మొగ్గ విచ్చుకోకుండానే
తొడిమె రాలినట్లు
రంగుల ప్రపంచమది
వెండి వనం నిండా
తెరవెనుక తోడేళ్ళు
నవరసాలు పండించిన
నవవయ్యారి
కాసుల వర్షం కురిపించినా
నమ్ముకున్నోడి ద్రోహంతో
నట్టేట మునిగింది
ఇప్పుడు
ఆకలి పంజరంలో బందీ
నవ్వూ ఏడుపూ
ఆనందం, విచారం
భయం, కోపం
ఇప్పుడు ఇన్‌స్టంట్
ఈస్ట్‌మన్ స్వప్నాలు
ఇంకా మిగిలున్నాయా!?

(విశాలాంధ్ర, 11-ఆగస్ట్, 2002)

అతడు

అతని కళ్ళల్లో
దీపం కాంతి ప్రతిఫలిస్తుంది
ఎదురుగాలిని సైతం
వాలుగాలిగా మార్చుకుంటాడు
పురోగమనం
అతని నైజం
గతుకుల దారిలో కూడా
నమ్మకం దుప్పటి పరుస్తాడు
లోయైనా శిఖరమైనా
నిబ్బరమే నిలువెత్తుజెండా
మనసులో మొలిచే కలుపు మొక్కల్ని
ఎప్పటికప్పుడు ఏరిపారేసే
నిత్యకృషీవలుడతడు
అతడి బతుకు బండి
కష్టాల కట్టలు దాటుకుంటూ
జేగంటలు మోగిస్తూ
సాగిపోతూనే వుంటుంది.

(పత్రిక, నవంబరు, 2002)

అనిర్వచనం

నిన్న
లవ్
ఎట్ ఫస్ట్ సైట్
నేడు
లవ్
ఎట్ ఫస్ట్ ఛాట్

(చినుకు మాసపత్రిక, ఏప్రిల్, 2005)

సౌందర్యం ఒక ఎడారి

మనసుమడిలో
మకిలి తొలుస్తూ వుంది
ఆబగా చూసే కళ్ళన్నీ
సామూహికంగా
దేహాంగాలను బేరీజువేస్తాయి
పొంచిపొంచిచూసే
మార్కెటింగ్ క్రిమి

యత్ర నార్యస్తుపూజ్యంతే...
ఒట్టి ట్రాష్
చప్పట్ల డప్పులు మోగుతాయి
ధగధగల కిరీటంతో
అసూర్యంపశ్యసౌందర్యాలు
గోడలపై
ప్రత్యక్షం!
ఆమె అంగాలు ఒక్కొక్కటే తెగిపోయి
న్యూస్ పేపర్లలో
సెక్స్ మేగజైన్స్‌లో
విరగబూసి వేలాడతాయి
అందాల్ని అమ్ముకుందామని
పోటాపోటీగా
ఆరాటపడే దళారులకి
సౌందర్యం
ఇక ఎడారిలో ఒయాసిస్సే!

("సంతకాలు" కవితా సంకలనం)

చేనుగట్టు

ఇవాల్టి
నా చిరునామాకి
నాందీ ప్రస్తావనా
మా పొలం దగ్గర్నుంచే...
జీవన సంగీతానికి
రాగం తానం పల్లవీ చరణాలు
మా చేల చెలియలిగట్లే...
కొద్దిపాటి సమయం దొరికిందంటే చాలు
మనసు పక్షిగా మారి
పొలంపైనే వాలుతుంది
ఒక్కొక్క చేనుకు ఒక్కొక్క పేరు
మెతుకు ముద్దల్ని అందించే ఆ పేర్లు
మనసు పొరల్లో పదిలంగా వున్నాయి
ఒక్కసారి పొలం గట్లు చుట్టి వస్తే చాలు
నరం నారుమడి అయ్యేది
కావిట్లో
నాన్న పొలానికి మోసుకొచ్చిన
మంచి నీళ్ళూ
మట్టి కుండలో
అమ్మ కలుపుకొచ్చిన
మజ్జిగన్నమూ
అలసి సొలసి
చెట్టు నీడన

కునుకు తీసిన సుఖమూ
ఎన్ని తపస్సులు చేస్తే దొరుకుతాయి..?
మొక్కల మొదళ్ళలో కలుపుతీయడం
నడతకు నడకనేర్పి
జీవితానికి జీవం పోస్తే
చెట్లకు పాదులు చేసి సాకడం
మమకారానికి మల్లెల బాట వేసింది
అరక దున్నడం
శ్రమ సౌందర్యానికి తావి కదా మరి...
అంతెందుకు...?
చేను గుర్తొస్తే చాలు
తలగుడ్డ చుట్టుకొని
పొలం గట్ల చుట్టూ తిరిగే
నాన్నే కన్పిస్తాడు.

("కవితాపుష్పకం" కవితా సంకలనం)

మా నాన్నకి మరోవైపు...

అరేయ్ ఒరేయ్ అని పిలిచి
మంచు కొండలాంటి
మా నాన్న పేరుకు మట్టిపూస్తారేమో
చెడు నడతలతో
నివురుగప్పిన నిప్పులాంటి
మా నాన్న పేరు చెడగొడతాడేమో...
తాత పేరు నాకు పెట్టేముందే
సవాలక్ష ప్రశ్నలు పీడించేవట
అంతటా
ఆధునికం అర్రులు చాస్తుంటే
ఇంకా నాకు తాత పేరు పెట్టారేమిటని
చిన్నతనపు జాడవీడనితనం
నిత్యం బాధపడేది
ఊహలు రెక్కలు తొడిగిన
రోజునుంచే
మా నాన్న పేరు నిలబెట్టాలనే
నాన్న చిన్నాన్నల
ఉత్సాహపు పలకరింపులు
ఆశలూ ఆశయాలకు వూపిరిపోశాయంటే
నాన్న చేతి చలవేనేమో
తాత గొప్పతనం
ఆత్మీయులు
కళ్లముందు సాక్షాత్కరింప చేస్తుంటే

ఆ పేరు నాకుపెట్టినందుకు
ఇప్పటికీ
గర్వంతో హృదయం తేలిపోతుంది
కులమత బేధాలు తెలియకుండా
అందర్నీ
ఆత్మీయపు పిలుపులతో
పలకరించడం నేర్పిన నాన్న
ఒక సమైక్యతా పాఠశాల
కడుపు నిండా తిండీ
చదువూ సంస్కారం
బతుకుబాటలో గతుకులు
దాటగలిగామంటే
అంతా పొలం చలవేనని
నిత్యం గుర్తు చేసే నాన్న
నేలతల్లికి ప్రతిరూపమే
నాన్న-
నాలో కొడుకునే కాదు
వాళ్లనాన్న పేరు పెట్టుకున్న
తన తండ్రినీ దర్శిస్తాడు

("నాయిన" కవితా సంకలనం)

ప్రకృతి వికృతిగా మారిన వేళ...

భుజ్... లాతూర్లలో
మట్టిలో దాక్కున్న మృత్యువు
సృష్టించిన మారణకాండ
ఇంకా తడారలేదు
నేలా నీరూ ఏకమై
మృత్యు తరంగమై
ఇప్పుడు
దేశాల ఎల్లల్నీ తుడిచి
ఎక్కడ చూసినా
శవాలగుట్టలే సరిహద్దులు
కన్నీటి కాష్టాల మధ్య చిట్లిన బతుకులు
మృత్యువు నీళ్లలో నక్కి
ఉపద్రవమై పోటెక్కితే
నీటి కడుపులో కాపురముండే
గంగపుత్రులకే కాదు
పుణ్యం కోసం
పున్నమి స్నానాలు చేసే
భక్తుల బతుకుల్లోనూ అమావాస్యే
సముద్ర గర్భంలో పుట్టిన భూకంపం
తల్లులకు గర్భశోకాన్నేకాదు-
అల్లా తననెందుకు తీసుకుపోలేదని
తల్లడిల్లే పిల్లాడికి
మృత్యు కౌగిలిలో చిక్కుకున్న

అమ్మానాన్నల ఆనవాలునూ దాచేసింది
గుట్టలు గుట్టలుగా శవాలూ
రోదనలూ ఆవేదనలే తప్ప
తనవాళ్లెవరో తెలియని ఆక్రందనల ఘోష..
అయినవాడు
శవమై ఒడ్డుకు చేరాడో...
కడలి కడుపులో కలిసిపోయాడో...
వేలాది జాలర్ల జాడ
జలాంబుధి అయినప్పుడు
తల్లడిల్లని తల్లి వుంటుందా...?
ఎవర్నీ మిగుల్చుకోలేని
ఏకాకి రోదన
మృత్యు ఘోషలో మిళితమైపోయింది
తడిచప్పుడు లేకుండానే
అలలు దెబ్బకొడుతూంటే
ఇక నీళ్లవంక చూడాలంటేనే
కన్నీళ్లు ఏరులైపారుతున్నాయి
సముద్రానికీ
ఆవలిగట్టు వున్నదనేమాట
ఇక బూటకమేనా?
ప్రకృతిని హరించాలనే
స్వార్థపరుడి తపనకి
ఇది ప్రతీకార చర్య అవుతుందా?

(కడలి తరంగాలకి బలైన కన్నీటి బతుకు జీవులకు సానుభూతితో)

("సునామి" కవితా సంకలనం)

ద్రవ్య భాష

అరే...
దివ్య భాష
ద్రవ్య భాషగా మారిందా?
మాతృభాష
మాట్లాడితే మరల మధ్య మందారమేనా...!?
చదువంటే
డాక్టర్లనీ ఇంజనీర్లనీ
మనోచట్రంలో బిగించుకున్న
పసియంత్రాలకు
రెడ్‌కార్పెట్ స్వాగతమా?
జేబుసత్తా
సర్కారీ స్కూలుకో చెట్టు కిందబడికో
సరి సమానమైనప్పుడు
లోచనేకాదు ఆలోచన కూడా వ్యర్థమేనా...?
రంగురంగుల యూనిఫారం మెరుపులకి
సమతామమతల లోకం
కల్లగా కన్పిస్తుంది
ఇండియాకన్న అమెరికాయే మిన్నగా
దర్శనమిస్తుంది.
కంప్యూటర్
బతుకులో ఒకభాగం కాదు
ఇప్పుడు అక్షరాలా జీవితమే

విజ్ఞానపు విత్తులు నాటాల్సిన క్షేత్రంలో
ఇప్పుడు
రౌడీయిజమూ కళ్లు తెరుచుకొంటోంది
మనసును
సమాజం ఆవరణలోకి
ప్రవేశించనీయకుండా
సిలబస్‌ను
సరిహద్దు రేఖగా గీస్తుంది
మానవీయ అనుబంధాలకోసం
వెతుకులాట
ఇది వ్యాపార వ్యవహారం
ఇక్కడ జరిగేది ర్యాంకుల పోరాటం

(విశాలాంధ్ర, 26-డిసెంబర్, 2004)

దాహార్తి

పెరట్లో చెట్టును
ప్రేమాభిమానాలతో పెంచుకోవాలేగానీ
ఉన్మాదాన్ని ఎరువుగా పోయకూడదు
జలం
జీవజీవాలకి చుక్కాని కావాలిగానీ
జీవితనౌకకు
చినిగిన తెరచాప కాకూడదు...
నీరు
ప్రకృతి సోయగాల పసిరిక పరికిణీ పరుచుకొని
ప్రవహించాలిగానీ
నెత్తుటితెట్టెలతో కాదు
దోసిళ్లు పట్టుకు తాగే ద్రవం
కన్నీరుగా మారితే
ప్రాణప్రదాయిని ఎలా అవుతుంది?
కడివెడు నీళ్లకోసం
"భాషా"ంతరీకరణ పొందిన
కళలు కూడా
కదంతొక్కుతుంటే
పొలాల్లో నీరు పారటానికి
నాగరికం పండించిన
నదీ పరివాహంలో
పోరుజరగాల్సిందేనా...

నీరు పల్లమెరిగినట్టే
మనిషి మనసెరిగినడిస్తే
సలసలాకాగే కావేరి
చల్లబడుతుంది
ప్రతిగుండె గొంతూ
పుష్కర గోదావరై పులకించి పోతుంది

(కావేరి జలం వివాదానికి స్పందించి)

(విశాలాంధ్ర, 21-అక్టోబర్, 2002,
"జలవాణి" కవితాసంకలనం)

మహాకవీ! మన్నించు

మహాకవి వాక్యాలకు
మరికొంత పొడిగింపు
దేశమంటే మనిషే... కాదనను
కానీ ఇవాళ... మట్టి కూడా
సందర్భాలు మారినప్పుడు
సారాంశాలు మారుతాయి
పురిటి గడ్డను
పునీతంగా భావించకపోతే
మనిషిని ప్రేమించడమెలా సాధ్యం?

పాలుతాగి
రొమ్ముగుద్దేవాడికి
మట్టి విలువ తెలియదు
మట్టి స్పర్శలేని మాటలు
వాసనలేని పువ్వులు

సొంతలాభం
కొంత మానుకోవాలి తప్పదు
పొరుగుకు ఇప్పటి అర్థం
పరాయితనం
దిద్దుబాటు రాయితో
కథల సౌధానికి
నువ్వు వేసిన పునాది
ఇప్పటికీ చెక్కు చెదరని కాంక్రీటే

నువ్వు సృష్టించింది
ఒక్క గిరీశమే
ఇప్పుడు చుట్టూ
గిరిగీసుకున్న ఈశులే
నువ్వు గుచ్చిన ముత్యాలసరం
తెలుగు సరస్వతి మెడలో వన్నె చెడని హారం

దేశమంటే మనుషులేనోయ్
అయితే
ఆ మనుషులు
మట్టి మనుషులైతే
మరీ మేలోయ్

(ప్రజాశక్తి, 29-నవంబర్, 2004)

వీచికలు

పేగు మాడినా
పట్టించుకోరు
రొట్టెమాడిందా
ఊరుకోరు

*   *   *

ఎప్పుడూ ఇంతే
స్వార్థం
కులం బురఖావేసుకొని
వక్రగతితో నడుస్తుంది

*   *   *

రాజ్యాంగం ప్రకారం
ఎవరైనా
ఎక్కడైనా ఉండొచ్చు
కానీ
ప్రాంతీయుల నాటకాలు
ఇన్నీ అన్నీ కావు
ఛ!
ఇదేం భారతీయం

*   *   *

సర్వమతాల సారం
శాంతి

ఉన్మాదం
అయస్కాంత కాంతి
అందుకే
పావురాలు రాలిపడుతున్నాయి
భావవాహికలే
బంతులు
బడుగులతో
అడ్డగోలు క్రీడ
మాట
మౌనంలో దిగబడింది
నోరులేని పశువులు
మొరలెత్తి
మోడు భాషలో ఆక్రందన

* * *

యుద్ధమొస్తే
ఐకమత్యం
శాంతి సమయంలో
కొట్లాట
కావల్సింది
జాతి సమైక్యత కాదు
జాతీయ సమైక్యత

(నడుస్తున్న చరిత్ర, ఫిబ్రవరి-2004)

హింసక్రీడ

ఇది సరదాకాదు
శాడిజం
క్రూరత్వం

ద్వందార్థాల విషం
లేత గుండెలను కాల్చేస్తోంది
పిల్లికూతలు, నక్కవూళలూ
వెకిలి చూపులు
పాడు చేతలు
వావీ వరసాలేదు
ఈ నీచత్వం పేరు
ఈవ్‌టీజింగ్!

దీనికన్న బాధాకరం
ఉలుకూ పలుకులేని
మౌన ప్రేక్షకత్వం
లాభం లేదు
ఉక్కుపాదం మోపాలి దీనిపై

సైబర్ మేఘాలు

సైబర్‌మేఘాలు
కమ్ముకొస్తున్నాయి
ఒక గ్లోబల్ ప్రశ్నార్థకం
ఏవైపుకి వెళ్లాలో?

అనుబంధాలకు
బొర్రెపెడుతున్న
డాలర్ ఎర

సంస్కృతిని కబళిస్తున్న
కొండచిలువ ఛానళ్లు
ఆడతనాన్ని
ఆబగా ఆరబోసే
వాణిజ్య తిమిరాలు
చేతివృత్తులు చిత్తు చిత్తు
రాత్రికి రాత్రే
కోటీశ్వరుడు బనేగా
శరీరం ఒక ఆత్మకాదు
కొలతల ముద్ద
తిండికీ నీటికే కాదు
పీల్చేగాలికీ
ఇన్‌బ్రాండ్ నేమ్‌లొస్తాయ్
ముట్టిమే దునియా కాదు
మట్టి మనుష్యుల్ని పట్టించుకోవాలి

('ప్రపంచీకరణ ప్రతిధ్వని' కవితా సంకలనం)

పాపం దీపం ఏంచేసింది?

చిట్లిన దీపం చిమ్నీని
దోషిని చేస్తావా?
కాదు
మనిషితనం దూరి
దుర్మార్గం చేస్తుందంతే!

మనిషితనాన్ని
పెరపెరదీపం వెక్కిరిస్తుంది
మంచం చుట్టు కొలతకి
గుడిసే ఒక సమాధి
కదలలేని తనం
కాటికి దారిచూపిస్తుంది
పసితనమైనా
ముసలితనమైనా
గుండెల్ని కెలికే దృశ్యం!

అనంత దృశ్యం మాత్రం
నవవధువుగా ఊరేగినప్పుడు
వంటింట్లో ప్రారంభం జీవితం
అత్తా మామా పెనిమిటీ
ఇదో గోలగోల
పరిసరాల పదచిత్రం
పోయిన ప్రాణం తిరిగొస్తుందా?
ఇదో ఊసరవెల్లి వాదం .

మేనేజ్‌మెంట్ పురివిప్పి
నాట్యం చేస్తుంది
ప్రమాదంగా భ్రమింపజేస్తుంది

అభం శుభం ఎరగని
అసహాయ కేకలు
అగ్నికీలల్లో
సజీవదహనమౌతుంటే
చూసేవారికదొకదృశ్యమే
దృశ్యాల కలవాటుపడ్డ జనం మనం

ఇప్పుడు
ఖైదు చెయ్యాల్సింది
దీపం బుడ్డిని కాదు
గడ్డిమేసే బుద్ధిని...

(ఆకాశవాణి)

మెలికపడ్డ పేగు

గుప్పిట్లో ఇమిడిపోయేంత
చిన్న మొత్తం కోసం
హింసాత్మక ఎదురుచూపు
చచ్చిపోతే వచ్చే
కొత్త ఖాళీల కోసం
నిలువు కాళ్లతో
నిత్యం పడిగాపులు

* * *

మురికి మురికైన ముతకగుడ్డా
కురచబారిన చేతికర్రా
చెవితో ముడిపడ్డ దారానికి
భారమైపోతున్న
ముదిమి కళ్లద్దాలూ
ఇంకా బతికున్నదెందుకో
అర్థంకాని బావురుచూపు
అధికారులవైపూ
అధినాయకులవైపూ

* * *

కొడుకులెందుకు?
దహనకాండను
ఖండాంతర సీడీల్లో దర్శించడానికా

కూతుళ్లెందుకు?
కన్నకడుపు కాలిపోతుంటే
నిలువు గుడ్లేసుకు చూసేందుకా?
వేణ్ణీళ్లంటూ వుంటేగా
చన్నీళ్లు కలుపుకోడానికి
పేగును తెంచుకున్నది
మరోగడ్డను చుట్టుకోడానికి
కన్నీటి కాగడాలు
వెలుగుతున్నప్పుడు
ఎవరూ లేకపోతేనే మంచిది
ఈ పింఛను
వృద్ధాప్యానికి కానేకాదు
నిరాశకూ
నిలువెత్తు నిరాదరణకూ...

("వెక్కిరించిన వేలు ముద్ర" కవితా సంపుటి)

తదేకగీతం

మానవీయవనానికి
మమతల చెమ్మ
అప్పుడే శాంతిసుమాల పరిమళం
కళ్ళల్లో అసూయ
పళ్ళల్లో విషయం రగిలిస్తుంటే
చెట్టపట్టాల రైలుపెట్టెలూ
రెక్కల విమానాలై
ఖండాంతరాలకు ఎగిరిపోతే!
బతుకుయాత్రకు
బలపం కట్టుకున్న బడుగుకూడళ్ళూ
భస్మీపటలమే మరి!
నీటి బుడగల నేపథ్యం
పిరికితనం
కాబట్టే
బూడిదమసినో
బ్లాక్ బాక్స్‌నో
అడిగితెలుసుకోవాల్సిన అగత్యం
ఎన్నుయినా చెప్పు
రక్తం ఏరుగాపారించి
సాధించేదేమిటి?
గగన కుసుమాలేగా...?
తదేకంగా ఆలోచించండి.

(కవితామాలిక 2004)



ఈ కవి -
కలల అలలలో తేలిపోడు.

అలాగని -
అస్పష్ట మార్మిక పద చిత్రాలలో మునిగిపోడు,
ఆధిపత్య వాదాల వివాదాలలో కూరుకుపోడు.

ఒకవైపు సామాజిక చైతన్యాన్ని
ఆవిష్కరిస్తూనే
జీవన విలువలు, అంతరాంతర సీమల
విశ్లేషణలు, తాత్విక కోణాలవైపు
దృష్టి సారిస్తూనే ఉంటాడు.

అందుకు -
'లోయలో మనిషి', 'తొలకరి చినుకులు',
'చల్ల కవ్వం', 'రెప్పల చప్పుడు'...
కవితా సంపుటాలు సాక్ష్యాలు.

ఇప్పుడు ఈ 'తదేక గీతం' జీవన సంగీతంలా
ఆలపిస్తూ, ఆలాపిస్తూ సాహిత్యలోకాన్ని
అలరిస్తుందని ఆకాంక్షిస్తూ...